

నేటి నుంచే ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్

16న కళాశాలల్లో సీట్ల ఎలాట్‌మెంట్

ముందస్తు కౌన్సెలింగ్‌తో సీట్లు పెరిగే అవకాశం

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 30 : ఏపీ ఈఏపీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. ఈనెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రొసెసింగ్ ఫీజు చెల్లించుకోవాలి. 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విద్యార్థుల సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసుకోవాలి. 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కళాశాల ఎంపిక నమోదు చేసుకోవాలి. 13వ తేదీన కళాశాలలు మార్పు చేసుకొనే అవకాశం ఉంటుంది. 16వ తేదీన కళాశాలలో సీట్లు ఎలాట్‌మెంట్ చేస్తారు. 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కళాశాలలో విద్యార్థులు రిపోర్టింగ్ చేసుకోవాలి. ఈనెల 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

కావాల్సిన సర్టిఫికెట్స్

ఇంజనీరింగ్ చేరే విద్యార్థులు సర్టిఫికెట్స్ తప్పనిసరిగా ఆన్‌లైలో అప్‌లోడ్ చేయాలి. పదో తరగతి మార్కుల లిస్టు, ఇంటర్మీడియట్ మెమో, ఇంటర్మీడియట్ టీసీ, 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. వీటితో పాటు ఏపీఈఏపీ సెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు జత పరచాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, అర్హులైన ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్, లేదా ఒరిజినల్ రేషన్ కార్డును అప్‌లోడ్ చేయాలి. ప్రొసెసింగ్ ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.600 చెల్లించాలి. సర్టిఫికెట్ల అప్‌లోడ్‌లో విద్యార్థులకు ఏదైనా సందేహాలుంటే తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు.

సీట్ల భర్తీ పెరిగే అవకాశం

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ గతేడాది కంటే నెల ముందుగానే జరుగుతున్నది. దీంతో కళాశాలలో సీట్లు భర్తీ పెరిగే అవకాశం కనిపిస్తున్నది. డిగ్రీ అడ్మిషన్‌లు ఇంకా జరగలేదు. అందువల్ల ఇంజనీరింగ్ పైనే విద్యార్థులు దృష్టి ఉండవచ్చనే అంచనా వేయవచ్చు. దానికి తోడు ఈ ఏడాది ఏపీ ఈఏపీ సెట్‌లో 11,718 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి జిల్లాలోని 15 ఇంజనీరింగ్ కళాశాలలో గత ఏడాది లెక్క ప్రకారం 12,030 సీట్లలో 3,609 మేనేజ్‌మెంట్ సీట్లుకు పోగా 8,421 కన్వీనర్ సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మరో వెయ్యి సీట్లు పెరిగే అవకాశం ఉంది.





ఊరూ వాడా ఆనందం

నేడు ఎరియర్స్‌తో కలిపి పింఛన్ల పంపిణీ

ఉదయం 6 గంటల నుంచే ప్రారంభం

పెన్షన్ లబ్ధిదారుల్లో సంతోషం..

కూటమి నాయకులు, కార్యకర్తల్లోనూ జోష్

భీమవరం టౌన్, జూన్ 30 : పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి ఈ పింఛన్ మొత్తాలను పంపిణీ చేయటానికి అధికారులు సన్నద్ధమయ్యారు. ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే మూడు నెలలకు సంబంధించి ఎరియర్స్‌ను కలుపుకుని ఒకేసారి రూ.7 వేల రూపాయలు అందించనుండడంతో పెన్షన్‌దారుల్లో ఆనందం కనిపిస్తోంది. జిల్లాలో 2,32,885 మంది వివిధ పెన్షన్‌దారులకు ప్రభుత్వం ఎరియర్స్‌తో కలిపి 155.71 కోట్లు అందించనుంది. సోమవారం ఉదయం 6 గంటలకే పెన్షన్ దారులకు ఇళ్లకు వెళ్లి పెన్షన్ అధికారులు అందించనున్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలనే ఆదేశాలు అందాయి. ఇందుకు తగ్గటుగా కింద స్థాయి అధికారులకు పలు సూచనలు అందించారు. తొలిరోజే నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ధేశించుకున్నారు.

పెన్షన్ పండగలో కూటమి శ్రేణులు

ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటీ నెరవేరుస్తోంది. దీంతో కూటమి నాయకులు, కార్యకర్తలల్లో కూడా జోష్ నెలకొంది. అన్ని ప్రాంతాల్లోను పెన్షన్ పంపిణీ ఒక పండుగులా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు రెడీ అవుతున్నారు. ప్రతీ గ్రామంలోను ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కార్యక్రమాలు రూపొందించుకున్నారు. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం, ఆచంట, ఉండి నియోజకవర్గాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కలసి పెన్షన్ పంపిణీల్లో పాల్గొంటారు. పెంచిన పెన్షన్ కార్యక్రమాలను నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. ప్రతి గ్రామంలోనూ కూటమి శ్రేణులు పాల్గొనేలా అధిష్టానం మార్గనిర్దేశం చేసింది.

సన్నద్ధమైన సచివాలయ సిబ్బంది

పెన్షన్లు పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది సన్నద్ధమయ్యారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ అందజేయనున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారు. అందుకోసం నిధులు సిద్ధం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,282 మంది సచివాలయ సిబ్బందిని రంగంలోకి దింపారు. ఎన్నికల కోడ్ సమయంలోనూ ఇదే సిబ్బంది ఉన్నారు. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని విని యోగించలేదు. బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. సచివాలయాల వద్దకు రమ్మని వృద్ధులను ఆదేశించింది. మండుటెండలో వృద్ధులు బ్యాంకుల చుట్టూ తిరిగారు. సచివాలయాల వద్దకు వెళ్లారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందితోనే ఇంటింటికి పెన్షన్ ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



తప్పుడు ప్రచారం

జూలై నెలలో పెన్షన్ తీసుకోనట్టయితే రద్దవుతుందంటూ తప్పుడు ప్రచారం సాగుతోంది. మూడు నెలలకు ఒకసారైనా పెన్షన్ ఇస్తామంటూ అధికారులు స్పష్టం చేశారు. అయితే పెంచిన పెన్షన్‌ను ఎరియర్స్‌తో సహా ఇస్తుండడంతో లబ్ధిదారులంతా అందుబాటులో ఉన్నారు. తొలిరోజు పెన్షన్ పంపిణీ పూర్తి కానట్టయితే మంగళవారం కూడా అందజేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లా కలెక్టర్ నాగరాణి సమీక్ష నిర్వహించారు, అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలిచ్చారు.



• అప్పుడు పోరాటం చేసినా పెంచలేదు..

గత వైసీపీ పాలనలో దివ్యాంగుల పెన్షన్ పెంచాలని ఎన్నో పర్యాయాలు ఆందోళన చేసినా ఫలితం దక్కలేదు. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు దివ్యాంగుల రూ.3 వేల పెన్షన్ 6 వేలు చేస్తామని చెప్పారు. అడగకుండానే పెన్షన్ పెంచిన చంద్రబాబుకు దివ్యాంగులు రుణపడి ఉంటారు.

-సత్తి భాస్కర్ రెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి



• ఒకే సంతకంతో పెన్షన్ పెంచారు

గత వైసీపీ ప్రభుత్వం దఫదఫాలుగా రూ.250 చొప్పున పెంచారు. చంద్రబాబు ఒకే సారి వెయ్యి రూపాయలు పెంచారు. ఒకేసారి రూ. 7 వేలు అందుకోవడం ఆనందంగా ఉంది. మాట నెరవేర్చుకున్న కూటమి ప్రభుత్వానికి వృద్ధులు రుణపడి ఉంటారు.

-కె.లక్ష్మి, నెగ్గిపూడి



• వృద్ధులకు భరోసా కల్పించారు

కూటమి ప్రభుత్వం వృద్ధులకు పెన్షన్ పెంచి ఇవ్వడం భరోసా కల్పించినట్లే. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ మొత్తం వృద్ధుల్లో మానసిక స్థైర్యాన్ని కల్పిస్తున్నది.

-యామజాల నరసింహమూర్తి, పాలమూరు



ఆచంట సీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టరు నాగరాణి...పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువును ఎత్తుకున్న కలెక్టర్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

ఆసుపత్రులను సందర్శించిన జిల్లా కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు/ ఆచంట, జూన్ 30 :పేదలకు మెరుగైన వైద్య సేవలందించడంలో వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగే విధంగా వైద్యాధికారులు కృషిచేయాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. ఆదివారం పాలకొల్లు ఏరియా ఆసుపత్రి, ఆచంట సీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలకొల్లు ఆసుపత్రిలో ఓపీ వార్డు, ప్రసూతి వార్డులను పరిశీలించారు. రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ప్రశించారు. ప్రసూతి వార్డులో ఒక శిశువును ఎత్తుకుని ముద్దు పెట్టుకుని ఆడించారు. తాను తరచూ తనిఖీలు నిర్వహిస్తానని ఏవిధమైన అలసత్వం, అశ్రద్ధ కనపరిచినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు జ్వరాలు, అతిసార, డెంగీ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయేరియా కేసులు ఇప్పటి వరకూ రాలేదని సిబ్బంది చెప్పడంతో అయినప్పటికీ 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలలు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమం చేట్టాలని తెలిపారు.ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బూన్, హెడ్‌నర్సు ఫాతిమా సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటరును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పలు వైద్య విభాగాలను పరిశీలించారు. డ్యూటీ రిజిస్టరు పరిశీలించి ఎంతమంది డ్యూటీలో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో వైద్యాధికారి విధుల్లో లేకపోవడం గమనించి సిబ్బందిని ప్రశ్నించారు. ఓపీ వార్డులను, ప్రసూతి వార్డులను పరిశీలించి, అక్కడ ఉన్న రోగులు,వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందుతున్న వైద్య సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు నుంచి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు.హెడ్ నర్సు జి.రుక్మిణి, ఫార్మసిస్ట్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

భీమవరంటౌన్, జూన్ 30: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కారానికి ప్రజల నుంచి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్) ద్వారా ప్రజల నుంచి ప్రతి సోమవారం సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పోలవరం..ఇక పరుగులు

ప్రాజెక్టును పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం

ఇంజనీరింగ్ అధికారుల్లో కొత్త ఉత్సాహం

పోలవరం,జూన్ 30 : పోలవరం ప్రాజెక్టులో అమెరికా, కెనడా దేశాలకు చెందిన ప్రాజెక్టు నిర్మాణ రంగ నిపుణుల పర్యటనతో ఆదివారం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందిలో కొత్త ఉత్సాహం ఉరకలేసింది. గత ఐదేళ్లుగా పడకేసిన పోలవరం ప్రాజెక్టు పనులు ఇటీవల నూతన ప్రభుత్వ పాలన ప్రారంభం నుంచి ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పోలవరం ప్రాజెక్టు పరిశీలన అనంతరం కేంద్రం ప్రభుత్వానికి ప్రాజెక్టు పరిస్థితులపై నివేదికలు పంపిన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు అథార్టీ నియమించిన విదేశీ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంది. విదేశీ నిపుణుల బృందంలో అమెరికాలో ప్రాజెక్టు నిర్మాణ రంగంలో నిపుణులైన జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి.పాల్, కెనడాకి చెందిన సీన్ హించ్ బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ ఉన్నారు. ఈ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టులో ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రాజెక్టు పరిశీలనా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ బృందం ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణంలో సమస్యాత్మక ప్రాంతాలైన ఎగువ కాఫర్ , దిగువ కాఫర్ డ్యాంల నిర్మాణం, సీవేజీ తదితర అంశాలపై సుమారు 6 గంటల పాటు క్షేత్ర స్థాయిలో సుదీర్ఘ పరిశీలన చేసి సంబంధిత వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద భూగర్భం నుంచి బోర్ డ్రిగ్గింగ్ ద్వారా సేకరించిన మట్టి నమూనాలను బృంద సభ్యులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కాఫర్ డ్యాంల నిర్మాణ దశలను పరిశీలించారు. పలు సమస్యల పట్ల కూలంకషంగా వివరాలు విదేశీ నిపుణుల బృందం ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. విదేశీ నిపుణుల బృందానికి సీడబ్ల్యుసీ డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్ కుమార్, ప్రాజెక్టు సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఈ నరసింహమూర్తి సంబంధిత వివరాలను తెలిపారు. సోమవారం ప్రాజెక్టులో డయాఫ్రంవాల్, పీజియో మీటర్ గ్యాప్ 2 ప్రాంతాలను ఈ బృందం పరిశీలించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అథార్టీ ప్లానింగ్ అండ్ డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ రాజేష్ కుమార్, వ్యాప్కోస్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్కే పట్నాయక్, ఈఈలు మల్లిఖార్జునరావు, ప్రేమ్ చంద్, పాండురంగయ్య, శ్రీనివాసరావు తదితరులు బృందం వెంట ఉన్నారు.



సీవేజీ జలాలు పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం



ప్రాజెక్టు అతిథి గృహంలో ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న విదేశీ నిపుణుల బృందం



నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

ధరించకపోవడమే ఎక్కువశాతం మరణాలకు కారణం

నేటి నుంచి తప్పనిసరి చేస్తూ ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ

భీమవరం క్రైం, జూన్ 30 : ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. దానికి కారణం హెల్మెట్ లేకుండా ప్రయాణం చెయ్యడమే. హెల్మెట్ దారణ వల్ల కలిగే లాభాల గురించి ప్రభుత్వాలు, పోలీసులు పలు రకాలుగా అవగాహన కల్గిస్తున్నా చాలామంది పట్టించుకోకపోవడంతో ప్రమాదాల్లో మృత్యువాత పడు తున్నారు. జూలై 1వ తేదీ నుంచి హెల్మెట్ తప్పనిసరి అని హైకోర్టు ఆదేశాలతో అధికారులు సన్నద్ధం అయ్యారు. పోలీసులు ప్రధాన సెంటర్లు, పలు కూడళ్లలో తనిఖీలు చేసి జరిమానాలు విధించనున్నారు. జరిమానాలు వేసే చోట హెల్మెట్ విక్రయాల కూడా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తన కుటుంబానికి ఎలాంటి కష్టం రాకుండా వారి అవసరాలన్నీ సమకూర్చి తీర్చే కుటుంబ యజమాని తన కొద్దిపాటి నిర్లక్ష్యంతో అనుకోని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే అతడినే నమ్ముకున్న ఆ కుటుంబాన్ని చీకటి కమ్మేస్తుంది. భారత దేశంలో రోడ్డు ప్రమాదాలపై అనేక మంది అధ్యయనాలు చేసి చివరకు ద్విచక్ర వాహనదారుల ప్రమాదాలపై దృష్టి పెట్టారు. ఎవరైనా ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడగానే మొదట తల భాగానికి దెబ్బ తగులుతుందని స్పష్టం చేశారు. మనిషి తల 8 కేజీల నుంచి 13 కేజీల బరువు ఉంటుందని ప్రమాదం జరిగి రోడ్డుపై పడినప్పుడు తొలుత తల నేలకు తగులుతుందని ఆ తర్వాతే కాళ్ళు, చేతులు తగులుతాయని వైద్య నిపుణులు గుర్తించారు. సీసీ కెమెరా పుటేజ్‌లోను ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించారు. ఈ పరిస్థితిలో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోకుండా ఉండాలంటే ఖచ్చితంగా హెల్మెట్ ధారణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వాలు చట్టాలను చేశాయి. ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్‌ను ధరించి ద్విచక్ర వాహనాన్ని నడపాలని నిబంధనలు విధించారు. వాహనాన్ని అమ్మే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్‌ను ఇవ్వాలని మోటారు షోరూమ్ నిర్వాహకులకు ఆదేశాలు ఇవ్వడంతో ప్రస్తుతం ఏ బైక్ కొన్న ఖచ్చితంగా హెల్మెట్‌ను వాహనదారుడికి అందిస్తున్నారు.



కేవలం రూ.100 జరిమానా..

ఇప్పటి వరకు హెల్మెట్ లేకపోవడం వల్ల కేవలం రూ.100 జరిమానా విధిస్తున్నారు. ఆ జరిమానాను సచివాలయంలో, ఆన్‌లైన్‌లో,మీ-సేవలోనూ చెల్లించాలంటే అదనంగా రూ.35 ఫీజును కట్టాల్సి ఉంటుంది. జరిమానా తక్కువే కదా అని చాలామంది హెల్మెట్ ధరించడంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొంతమంది అయితే హెల్మెట్లు ధరించడం వల్ల జుట్టు ఊడిపోతుందనే భావనతో మానేస్తున్నారు. వాస్తవానికి హెల్మెట్ ధారణ వల్ల జుత్తు ఊడిపోవడం జరగదని దుమ్ము, ధూళి, సూర్యరశ్మి నుంచి కాపాడుతుం దని వైద్యులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు హెల్మెట్ ధరించడం వల్ల ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే అది చాలా ఉపయోగపడుతుంది. రోడ్డుపైన పడిన వెంటనే హెల్మెట్ ఉండటం వల్ల తలకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రాణాలకు ఎలాంటి ముప్పు ఉండదు.

నిబంధనలు అతిక్రమణ

ఖచ్చితంగా మోటారు వాహనాన్ని నడిపేట ప్పుడు హెల్మెట్ ధరించాలని, ఆ వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలని నిబంధనలు ఉన్నా కొంతమంది వీటిని అతిక్రమిస్తున్నారు. గతేడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే హెల్మెట్ ధరించని వారూ ఎక్కువగా మృతి చెందారని గుర్తించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఈ దిశగా జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడు తున్నారు.

• జూలై 1 నుంచి స్పెషల్ డ్రైవ్

రాష్ట్ర హైకోర్టు తీర్పు ఆదేశాలతో ఉన్నతాధికారుల ఆదేశాలతో జూలై 1 నుంచి అన్ని చోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు భీమవరం ట్రాఫిక్ సీఐ దాసు తెలిపారు. గతంలో వాహనాలను ఆపి తనిఖీలు చేసి ఫైన్ వేసేవాళ్లం. అయినా వాహనదారుల్లో మార్పు రాలేదు. ఇక వాహనాలు తనిఖీలు చేసి రూ.500 జరిమానా విధిస్తాం. హెల్మెట్ వినియోగంపై ఎన్నో సార్లు అవగాహన కల్పించినప్పటికి చాలామందిలో మార్పు రాలేదు. ముఖ్యంగా యువతకు వాహనాలు ఇవ్వకుండా చూసుకోవాలి.



-దాస్, ట్రాఫిక్ సీఐ, భీమవరం

ఎన్నో ప్రమాదాలు

హెల్మెట్ లేకపోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల భీమవరం మండలం తాడేరులో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒక ఇంజనీరింగ్ విద్యార్థి మృత్యువాత పడ్డారు. కారణం హెల్మెట్ లేకపోవడం వల్లే అని పోలీసులు చెబుతున్నారు. 20 రోజులు క్రితం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు వద్ద ముగ్గురు యువతులు ద్విచక్ర వాహనంపై వెలుతుండగా రోడ్డు ప్రమాదం సంభవించి ఇద్దరు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపురంలో రెండు రోజుల క్రితం ఒక రోడ్డు ప్రమాదంలో యువకుడు తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. భీమవరం శివారులో నెల రోజులు క్రితం ఒక పెట్రోల్ బంక్ వద్ద ఇద్దరు యువకులను లారీ ఢీకొనడంతో ఒక యువకుడు తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు.

సచివాలయాలపై చెరగని జగన్ ముద్ర

» ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వలేదని అధికారుల స్పష్టత



కోరుమిల్లి సచివాలయంపై జగన్ ముద్ర

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30 : కూటమి ప్రభుత్వం కొలువై నెలరోజులు గడుస్తున్నా జిల్లాలో సచివాలయాలపై జగన్ ముద్ర చెరగడంలేదు. నవరత్నాల పేరుతో జగన్ చిత్రపటంతోపాటు నవరత్నాలు చిత్రాలు ఉండేట్లు సచివాలయాలపై ఏకంగా టైల్స్‌తో అంటించేశారు. ఎన్నికల కోడ్ సమయంలో వాటిపై క్లాత్‌తో కప్పి ఉంచారు. వాటిని నేటికీ కొన్ని చోట్ల మాత్రమే క్లాత్‌తో కప్పి ఉంచారు. 90 శాతం పైగా సచివాలయాలపై నేటికీ ఆ నవరత్నాలు దర్శనమిస్తున్నాయి. అంటే జిల్లా పంచాయతీ అధికారులకు గత ప్రభుత్వంపై ఉన్న భక్తి ఇంకా తగ్గలేదని అందుకనే ఈ నవరత్నాల బోర్డులపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వడంలేదంటూ కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి రోళ్లకంటి విక్టర్‌ను వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..


1914 నాటి ప్రధాన రాజగోపురం


ప్రస్తుతం ఇరువైపులా కార్యాలయాలు, పాదుకా మండపంతో ప్రధాన రాజగోపురం మెట్ల దారి

ద్వారకాతిరుమల, జూన్ 30: దాదాపు 110 సంవత్సరాల క్రితం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన రాజగోపురం ఈవిధంగా ఉంది. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పేరు గాంచింది. 1914లో ఉన్న ఆలయ దక్షిణ గోపురానికి ఇప్పటి గోపురానికి మధ్య చాలా అభివృద్ధి కన్పించింది. గతంలో ఆలయ గోపురాల పక్కన కొండలు, వృక్షాలతో ఉండేదని కాలక్రమేణా వచ్చిన అధికారులు పరిసరాలను అభివృద్ధి చేశారు. గతంలో తూర్పుగోపురం పక్కన అంతా కొండతోనూ చెట్లతో చిట్టడవిని తలపించేదిట. అప్పటి ఈవో ఎంఎస్‌రావు దానిని తొలగింపజేసి దారిని ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం భక్తులకు సౌకర్యంగా ఉంది. ప్రధాన రాజగోపుర మెట్ల దారి సైతం ప్రస్తుతం ఇరువైపులా ఆలయ కార్యాలయం, పద్మావతి, ఆండాళ్ సదనాలను నిర్మించారు. మెట్లకు ఇరువైపులా దశావతార చరిత్రతో విగ్రహాలు, మెట్ల దిగువన పాదుకా మండపాన్ని సైతం నిర్మించారు.

నెరవేరనున్న అయోధ్యలంక వాసుల కల

» బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పితాని ఆదేశం


2014లో శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఇదే..

ఆచంట, జూన్ 30 : ఆచంట మండలం అయోధ్య లంక ప్రజల చిరకాల స్వప్నం త్వరలోనే నెరవేరనుంది. 2014లో అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ అయోధ్యలంక-పుచ్చల్లంక గ్రామాలను కలుపుతూ వశిష్ట గోదావరి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటిలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాల విలువ రూ.50కోట్లుగా నిర్ధారించారు. పదేళ్లుగా బ్రిడ్జికి సంబంధించి ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో శిలాఫలకం మాత్రమే దర్శనమిస్తుంది. ఇప్పటివరకు లంక వాసుల కల నెరవేరలేదు. మళ్లీ పితాని ఆచంట నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ బ్రిడ్జితోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను అనుసంధానం చేస్తూ కోడేరు నుంచి పి.గన్నవరం, నేషనల్ హైవే కనెక్టివిటీకి సంబంధించి దీనిపై గతంలో ఆయన చంద్రబాబుతో చర్చించారు. ఇది కూడా చేపట్టాలని ఎమ్మెల్యే పట్టుదలతో ఉన్నారు. పలు అభివృద్ధి పనులపై సమీక్షలు చేస్తుండడంతో నియోజక వర్గ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏ ఒక్కరూ తీసుకునే నిర్ణయం కాదు

» కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ


భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసవర్మ దంపతుల పూజలు

భీమవరం టౌన్, జూన్ 30 :విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏ ఒక్కరూ నిర్ణయం తీసుకునే వ్యవహారం కాదని గతంలోని మోదీ అధికారంలోకి రాకముందే ఒక పాలసీపరంగా తీసుకున్న నిర్ణయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది ఒక్క విశాఖ ఉక్కుకు సంబంధించి విషయం కాదన్నారు. రీ ఇన్వెస్ట్మెంట్ ప్రక్రియలో భాగంగా విశాఖ స్టీల్ ప్లాంట్ దానిలోకి రావడం జరిగిందన్నారు. ఏ విధంగా విశాఖ ఉక్కును రక్షించుకునే అవకాశం ఉంది అనేది ప్రధాని మోదీతో మాట్లాడి ఆయన నిర్ణయాన్ని బట్టి భవిష్యత్తు నిర్ణయం ఉంటుందన్నారు. దీనిపై కేంద్రంలో ఉన్న పెద్దలను, ఉన్నతాధికారులను కలసి మాట్లాడడం జరిగిందన్నారు.

సోమేశ్వరస్వామికి శ్రీనివాసవర్మ దంపతుల పూజలు

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, వెంకటేశ్వరదేవి దంపతు లు పంచారామ క్షేత్రమైన భీమవరం సోమేశ్వర, జనార్దనస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

మన్‌కీ బాత్ మంచి కార్యక్రమం..

దేశ ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్ కార్యక్రమం'లో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ద్వారా ప్రజలను చైతన్యం వంతులను చేయడంతో పాటు ఆలోచిపంచేసే అనేక విషయాలను ప్రస్తావించి దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. భీమవరం అసెంబ్లీ కన్వీనర్ కాగిత సురేంద్ర, కలిదిండి వినోద్‌కుమార్‌వర్మ, షేక్ మొహిద్దీన్, రాయప్రోలు రాజశేఖర్ పాల్గొన్నారు

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

» మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు రూరల్, జూన్ 30 : గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుని పెన్షన్ సొమ్మును అందజేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ సొమ్ము పెంపు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అని, మానవతా వాది చంద్రబాబునాయుడు అని, జగన్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేయడమే కాకుండా రూ.12 లక్షల కోట్లు అప్పు పెట్టినప్పటికీ పేదలకిచ్చిన మాట మేరకు పెంచిన పెన్షన్ సొమ్ముతో పాటు మూడు నెలల బకాయి సొమ్ము కలసి రూ.7 వేలు సోమవారం నుంచి అందిస్తామన్నారు. పాలకొల్లు నియోజక వర్గంలో గతంలో రూ.8.79 కోట్లు కాగా ప్రస్తుత పెన్షన్ సొమ్ము పెంచడంతో రూ.20 కోట్లకు పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, ఎంపీడీవో అనుపమ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 1,538 కేసుల పరిష్కారం



ఏలూరు క్రైం, జూన్ 30 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 1,538 కేసులు పరిష్కరించామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ తెలిపారు. జూన్ 29వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని జిల్లా వ్యాప్తంగా బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రమాద బీమా కేసులలో 8 కోట్ల రూపాయలపైగా పరిహారం కింద చెల్లించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌తో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఇతర అధికారులందరికీ ఆయనతో పాటు జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

పల్లా శ్రీనివాస్‌కు లక్ష్మీరాణి అభినందన



కైకలూరు, జూన్ 30: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏలూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి అభినందించారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం పట్ల అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆయన సూచించినట్లు లక్ష్మీరాణి తెలిపారు.



కనువిందు..

కలిదిండి మండలం పోతుమర్రు పంచాయతీ పరిధి గొల్లగూడెంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు పసుపు రంగు పూలతో విరబూసి ప్రజలను ఆకట్టుకుంటోంది. ఆకులు కూడా కనపడకుండా పూలు విరబూసి కనువిందు చేస్తోంది. యువత ఇక్కడ సెల్ఫీలు దిగుతోంది.

-కలిదిండి

ప్రజాపాలనకు రాజ్యాంగ పీఠికే గీటురాయి


తణుకులో 'దారి దీపం' పుస్తకావిష్కరణ దృశ్యం

తణుకు, జూన్ 30: రాజ్యాంగ పీఠిక పాలకుల ఆచరణకు, ప్రచారాలకు గీటురాయి కావాలని.. అందుకు పౌర సమాజం గళం విప్పాలని ప్రముఖ సాహితీవేత్త డీవీవీఎస్ వర్మ అన్నారు. ఆదివారం తణుకు సురాజ్య భవనంలో 'రాజ్యాంగ పీఠిక-ప్రజాపాలనకు దారిదీపం, బహుళ సంస్కృతిపై హిందుత్వ దాడి-ప్రత్యామ్నాయాలు' అనే రెండు అంశాలపై సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పీఠిక చిన్నదిగా కనిపించినా అది మాత్రం రాజ్యాంగంలోని అంతస్సారాన్ని వ్యక్తీకరిస్తుందని, దేశంలో అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను, మత విశ్వాస స్వేచ్ఛను, అందరికీ అవకాశాల సమానత్వాన్ని ప్రకటిస్తూ జాతీయ ఐక్యతను, సమగ్రతను ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పీఠిక దేశ ప్రజలకు వాగ్దానం చేసిందని, నిజమైన ప్రజాపాలన అంటే రాజ్యాంగ పీఠికను అమలు చేయడమేనన్నారు. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక పరిచయ కార్యక్రమాలను విద్యాసంస్థల సహకారంతో విద్యార్థుల భాగస్వామ్యంతో పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించాలని కోరారు. రాజ్యాంగంపై మతతత్వ దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రెండో సదస్సుకు ప్రముఖ జర్నలిస్టు మందలపల్లి కిషోర్ అధ్యక్షత వహించగా కె.శాంతారావు, డాక్టర్ స్టాలిన్, విశ్రాంత న్యాయాధికారి లక్ష్మి, హైమవతి, వావిలాల సరళాదేవి చర్చలో పాల్గొన్నారు. అనంతరం 'దారి దీపం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వర్మ పుట్టినరోజును పురస్కరించుకుని ఆత్మీయ సభకు ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ అధ్యక్షత వహించగా పలువురు మాట్లాడారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణగా చదువుకోవాలి

» పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి


పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతన్న కలెక్టర్ నాగరాణి

పెనుగొండ, జూన్ 30 : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణగా చదువుకుంటే భవిష్యత్తు గొప్పగా ఉంటుందని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. ఆదివారం పెనుగొండలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వసతి గృహాన్ని, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై ఆరా తీశారు. విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకునేలా పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. అన్ని విషయాలపై పూర్తి పరిజ్ఞానం కలిగినప్పుడే చదువులో కూడా మరింత రాణించగలరన్నారు. చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వసతి గృహంలో ఏదైనా సమస్య ఉంటే తెలపాలని విద్యార్థులను అడగగా తాగు నీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహ ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో ఐదు నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులకు వసతి కల్పించామని, 450 మంది వరకు కెపాసిటీ ఉందని, అడ్మిషన్స్ జరుగుతున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. 2+2 మహిళా సెక్యూరిటీ సిబ్బందిని 24 గంటలు గృహంలో ఏర్పాటు చేశామన్నారు. వసతి గృహం నిర్వహణపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు.

ఇంటిలో ఎవరూ లేరని గమనించి..

» రూ.3.70 లక్షల నగదు,10 కాసుల బంగారం 4 కేజీల వెండి వస్తువుల అపహరణ


ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు

జంగారెడ్డిగూడెం, జూన్ 30 : ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రధాన ద్వారం పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దోచుకెళ్లిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో శనివారం రాత్రి జరిగింది. లక్కవరం ఏఎస్ఐ బాస్కరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దోరేపల్లి లక్ష్మీనారాయణ ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టి దుండగులు లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.3.70 లక్షల నగదు, పది కాసుల బంగారు ఆభరణాలు, 4 కేజీల వెండి వస్తువులు అపహరించారు. దోరేపల్లి లక్ష్మీనారాయణ కుమారుడు రామరాజు మాట్లాడుతూ తన తల్లి ఆసుపత్రి పని నిమిత్తం, తమ్ముడు, చెల్లెలు ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రి ఆసుపత్రి పని నిమిత్తం ఏలూరులో తన దగ్గర ఉంటున్నారన్నారు. ఐదు రోజులుగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. చోరీ జరిగిన ఇంటికి ఏలూరు నుంచి క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించిందని, చోరీపై రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

కోడి పందేలపై దాడి.. నలుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం, జూన్ 30:జంగారెడ్డిగూడెం పట్టణంలోని ముత్రాసుపేటలో జరుగుతున్న కోడి పందేలపై ఎస్ఐ జ్యోతిబసు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1050 నగదు, ఒక కోడి పుంజు, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు.

బంధువుల ఇంటికెళ్లి వచ్చేసరికి దోచేశారు

» 8 కాసుల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు అపహరణ

పెదపాడు, జూన్ 30 : ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని నగదు, డబ్బు తస్కరించిన ఘటన పెదపాడు మండలం వీరమ్మకుంట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో నివాసముంటున్న మరడాని సోమేశ్వరరావు జూన్ 22వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి 30వ తేదీ ఆదివారం ఇంటికి వచ్చేసరికి ఇంటితాళాలు బద్దలు కొట్టిఉన్నాయి. దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు తస్కరించినట్టు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 30 : ఆన్‌లైన్ యాప్ ద్వారా పెట్టుబడి చేస్తే అధిక మొత్తం లాభాలు వస్తాయని వాట్సాప్‌లో ఒక లింకు రావడంతో దానిని నమ్మి పెట్టుబడి పెట్టిన ఓ వ్యక్తి మోసపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన కాశిన సుధాకరరావు కాంట్రాక్టు వర్కులు చేస్తుంటాడు. అతడి వాట్సాప్‌లో జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్ పేరుతో ఒక లింకు వచ్చింది. ఆ లింకుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తొలుత ఐదు వేల రూపాయలు పెట్టుబడిపెట్టగా అధిక లాభాలు ఇచ్చారు. దానిని నమ్మి మరికొంత సొమ్ము పెట్టుబడి పెట్టగా దానికి కూడా ఇచ్చారు. చివరకు 15 లక్షల 25 రూపాయలు పెట్టుబడి పెట్టగా వారి నుంచి ఎలాంటి సమాధానం లేదు. తమ కంపెనీ గుర్తింపు పొందిందేనని ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని నమ్మబలికారని ఆ తరువాత సమాధానం చెప్పడం లేదంటూ వాపోయాడు. ఆదివారం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ కంపెనీపై కేసు నమోదు చేశారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పాలకొల్లు రూరల్, జూన్ 30 : పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశామని పాలకొల్లు రూరల్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఉల్లంపర్రు గ్రామ శివారు ప్రాంతంలో పేకాటాడుతున్నట్టు సమాచారంతో ఆదివారం సాయంత్రం సిబ్బందితో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1230 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రాగి వైర్లు మాయం

» విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో తొలగిస్తున్న వైనం
» ఆపై సొమ్ము చేసుకుంటున్న దొంగలు
» వరుస చోరీలతో రైతుల్లో ఆందోళన
» దర్భగూడెంలో శనివారం రాత్రి రాగి వైర్ల తస్కరణ


పి.రాజవరంలో రాగి వైర్లు తీసిన దృశ్యం

దర్భగూడెంలో రైతు వాసు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ అయిన దృశ్యం

జీలుగుమిల్లి, జూన్ 30 : రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్లు వరుస చోరీలకు గురవుతున్నాయి. దర్భగూడెంలో శనివారం రాత్రి డి.వాసుకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రాగి వైరు చోరీ చేశారు. విద్యుత్ స్తంభానికి ఐరన్ స్టాండ్ ఏర్పాటు చేసి పైన ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్‌కు దొంగలు విద్యుత్తు సరఫరా రాకుండా వైర్లు కట్ చేసి కింద పడేసి దానిలో ఉండే రాగివైర్లను చాకచక్యంగా దొంగిలించి తరలిస్తున్నారు. ఆ రాగి వైర్లను గుట్టుచప్పుడు కాకుండా అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేక్రమంలో రెండు రోజుల క్రితం పి.రాజవరంలో రైతు ప్రసాదరెడ్డి పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరు దొంగిలించారు. పది రోజుల క్రితం బర్రింకలపాడులో ఓ గిరిజన రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పోయింది. జీలుగుమిల్లి సమీప గ్రామాల రైతులు రాత్రి సమయంలో సైతం పొలాల్లో మోటార్ల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేసే సమయం దగ్గరపడడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తేకాని వ్యవసాయ పనులు ముందుకు సాగవని రైతులు చెప్పటం గమనార్హం. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు కొత్తది ఏర్పాటు చేస్తే రూ.25 వేలు వరకు ఖర్చు అవుతుందంటున్నారు. బాధిత రైతులు, విద్యుత్ శాఖ అధికారులు కలిసి పోలీసలకు ఫిర్యాదు చేయ్యాల్సి వస్తోంది. జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఏడీ కార్యాలయం ఏర్పాటు చేసినా, గత ఐదేళ్లుగా మండల ఎలక్ట్రికల్ ఏఈని నియమించలేదు. నేటి వరకు ఇన్‌చార్జి ఏఈ ద్వారా ఆ శాఖ ఉన్నత అధికారులు కాలం గడుపుతున్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైర్లు వరుస చోరీలకు పాల్పడే వారిపై పోలీసులు దృష్టిసారించాలని రైతులు చెబుతున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరుచోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఏలూరు జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందగా.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మరో ముగ్గురు మృతి చెందారు.

రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూన్ 30 : నడిచి రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన ఘటన మండవల్లి మండలం చావలపాడు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లాకు పార్వతీపురానికి చెందిన చిలకా నాయుడు (50) కొంతకాలం నుంచి మండవల్లి మండలం చావలపాడులో ఒంటరిగా ఉంటూ చేపల చెరువులపై కూలి పనులకు వెళ్తున్నాడు. శనివారం రాత్రి గ్రామంలో నడిచి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కైకలూరు మండలం గుమ్మళ్ళపాడుకు చెందిన కొండపల్లి మహేందర్ తన మోటారు సైకిల్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే చిలకా నాయుడు మరణించాడని నిర్ధారించి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

ప్రేమికురాలు దక్కలేదని యువకుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, జూన్ 30 : తాను ప్రేమించిన యువతి దక్కలేదని.. మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య వేసుకున్నాడు. భీమవరం రూరల్ రూరల్ హెచ్‌సీ మహేష్ తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం బేతపూడి గ్రామ పరిధిలోని యమునాపల్లి గ్రామానికి చెందిన బుంగా చందు(23) కొంత కాలంగా ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతికి ఇటీవల నిశ్చితార్థం వేరే యువకుడితో కావడంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి రెండు రోజులు క్రితం వెళ్ళిపోయాడు. దీనిపై భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. ఆదివారం మొగల్తూరు మండలం పాతపాడు గ్రామం వద్ద యనమదుర్రు డ్రెయిన్‌లో ఒక మృతదేహం ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీసులు పరిశీలించారు. బుంగా చందు మృతదేహంగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

పోడూరు, జూన్ 30 : అనారోగ్య పరిస్థితి కారణంగా ఓ యువతి మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పోడూరు మండలం జిన్నూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. జిన్నూరు చాకిరేవు గుంటకు చెందిన గారపాటి సౌజన్య(22) కొంతకాలంగా మానసిక సమస్య, ఫిట్స్ వ్యాధితో బాధపడుతుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సమయంలో మనస్తాపానికి గురై తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్నయ్య రాజు పరిస్థితిని గమనించి పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. అన్నయ్య రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.రాజ్‌కుమార్ తెలిపారు.


చికిత్స పొందుతూ యువకుడు..

ఏలూరు క్రైం, జూన్ 30 : ఏ కారణమో తెలియదు కాని ఒక యువకుడు పురుగుమందు తాగి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. పెనుగొండ మండలం దొంగరావిపాలెంనకు చెందిన తంగేటి వినాయకుడు(22)కు తండ్రి చిన్ననాడు మరణించగా తల్లి ఏడాది క్రితం మరణించింది. అతడి సోదరులు గల్ఫ్‌లో ఉంటున్నారు. వినాయకుడు హైదరాబాద్‌లో ఉంటూ టైల్స్‌పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల తన స్వగ్రామానికి వచ్చారు. ఏ కారణమో తెలియదు కాని శనివారం ఇంటి వద్ద ఉన్న అతడు పురుగుమందు తాగాడు. స్థానికులు గమనించి అతడిని తొలుత తణుకు ఆసుపత్రి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30: రైలు ఢీకొన్న ప్రమాదంలో 45-50 ఏళ్ల వయస్సు మధ్య గల వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి చేబ్రోలు, పూళ్ల స్టేషన్‌ల మధ్య రైలు ఢీకొట్టడం వల్ల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు వివరించారు. మృతుడు నలుపురంగుపై నీలం రంగు, తెలుపుతో చిన్న చిన్న గడుల లుంగీ, తెలుపురంగు టవల్ ధరించినట్టు వివరించారు. మృతదేహం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్ 94906 17090, 99480 10061 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టి కారు పల్టీ.. ఒకరి మృతి


కొవ్వూరులో కాలేజీ వద్ద ప్రమాద దృశ్యం (ఇన్‌సెట్‌లో) జోగినాథ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం/కొవ్వూరు, జూన్ 30: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్టు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం (అంకంపాలెం)లోని పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండికోట ఎస్‌వీ జోగినాథ్(34) జూన్ 29న కారులో రాజమహేంద్రవరం షాపింగ్‌కు వెళ్లాడు. షాపింగ్ పూర్తి చేసుకుని స్నేహితులతో కలిసి కల్కి సినిమా సెకండ్ షో చూసి తిరిగి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా అర్ధరాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో కుక్క అడ్డురావడంతో సడన్‌బ్రేక్ వేశాడు. ఈమేరకు కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగినాథ్‌కు తీవ్ర గాయాలై పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున ఓ డాక్టర్ ఆయనను పరిశీలించి మృతి చెందినట్టు చెప్పారు. కాకినాడకు చెందిన జోగినాథ్. 2009లో ఉద్యోగం నిమిత్తం జంగారెడ్డిగూడెం వచ్చి తల్లిదండ్రులకు ఉంటున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గండికోట శ్రీరామసూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడు జోగినాథ్‌కు తల్లిదండ్రులతో పాటు వివాహాలైన ఇద్దరు అక్కలు ఉన్నారు. తమ కుమారు డికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వేడుకగా మారెమ్మ జాతర

ఆచంట, జూన్ 30: ఆచంట వేమవరంలో మారెమ్మ జాతర ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు రోజులుగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మాచేనమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధికారి రాము ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వీరాంజనేయస్వామి వార్షికోత్సవాలు



ఉండి, జూన్ 30: శ్రీవీరాంజనేయ స్వామి వార్షికోత్సవాలు ఆదివారం సంత మార్కెట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయం వద్ద ఈనెల 26వ తేదీ నుంచి వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జూలై 3వ తేదీన ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని అఖండ అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బండి ముత్యాలమ్మకు కొత్తపల్లి పూజలు



మొగల్తూరు, జూన్ 30: తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మను ఆదివారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన కొత్తపల్లికి సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వర్షాలు కురుస్తుండటంతో ఈ ఆదివారం భక్తుల సంఖ్య తగ్గింది.

శ్రీవారికి పితాని దంపతుల పూజలు



పెనుమంట్ర, జూన్ 30 : మార్టేరు లోని శ్రీభూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అనంత లక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మేళాతాలాలు, మంగళవాయిద్యాలు, పూర్ణకుంబంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

కామాక్షి ఆలయ వార్షికోత్సవం



కామాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, జూన్ 30: పెంటపాడు కోనేరు చెరువు వద్ద గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: బొలిశెట్టి

పెంటపాడు, జూన్ 30: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పెంటపాడు పోస్టుబేసిక్ స్కూల్లో దిలీప్ ఏజన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండేన్ గ్యాస్ ఈకేవైసీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో సాయి ప్రదీప్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. కసిరెడ్డి మధులత, పుల్లా బాబి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, కొనకళ్ళ హరినాథ్, చామన సురేష్, దాసరి వెంకటేష్ పాల్గొన్నారు.

పితాని విజయోత్సవ ర్యాలీ వాయిదా

ఆచంట, జూన్ 30: ఆచంట మండలంలో ఆదివారం జరగవలసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విజయోత్సవ ర్యాలీ వర్షం కారణంగా వాయిదా వేశారు. మరలా ఆచంట మండలంలో విజయోత్సవ ర్యాలీ ఎపుడు నిర్వహించేది తరువాత ప్రకటిస్తామని ఎమ్మెల్యే క్యాంప్ ప్రతినిధి తెలిపారు.

నేడు పితాని చేతుల మీదుగా పింఛన్‌లు

ఆచంట, జూన్ 30: కూటమి ప్రభుత్వం ఇచ్చే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ కార్యక్రమం మండల వ్యాప్తంగా సోమవారం జరగనుంది. ఆచంట, కొడమంచిలి, వల్లూరు, వేమవరం గ్రామాల్లో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చేతుల మీదుగా అందించేందుకు గాను ఎంపీడీవో పి. నరసింహ ప్రసాద్ ఏర్పాటు చేస్తున్నారు.

జగనన్న కాలనీని చుట్టుముట్టిన సమస్యలు



బురదమయంగా మారిన జగనన్న కాలనీ

ఆకివీడు, జూన్ 30: ఎడతెరిపి లేకుండా మూడ్రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి తాళ్ళకోడులోని జగనన్న కాలనీలో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సెంటు స్థలం ఇచ్చి అధికారులు, వలంటీర్లతో భయభ్రాంతులకు గురిచేసి నిర్మాణాలు చేయించారన్నారు. తాగునీరు, డ్రెయినేజీ, రహదారుల సమస్యలతో కాలనీ వాసుల సమస్యలు కోకొల్లలు. తాగునీరు లేక బయట నుంచి కొనుగోలు చేసుకొని తాగుతున్నామని, డ్రెయిజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు పారుదల లేకపోవడంతో పాటు రహదారులు కూడా వేయకపోవడంతో వర్షాకాలంలో కష్టాలు పడుతున్నామని స్థానికులు తెలిపారు. కాలనీ మధ్యలో శ్మశానం ఉండడంతో పిల్లలు భయపడుతున్నారని, చుట్టూ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. కాలనీలో కొందరు నిర్మాణాలు చేసుకోకపోవడం వలన ఆ స్థలాల్లో చెరువుల్లా నీరు నిల్వ ఉండడంతో పాములు, పురుగులు తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాని మోదీ మన్ కీ బాత్ వీక్షణ

పాలకొల్లు టౌన్, జూన్ 30: భారత ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం చేపట్టిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం పాలకొల్లు నియోజకవర్గంలో బీజేపీ శ్రేణులు టీవీల్లో వీక్షించారు. పాలకొల్లు జర్నలిస్టు కాలనీలో 98వ నెంబర్ పోలింగ్‌బూత్‌లో ఏర్పాటు చేసిన టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నేత ఉన్నమట్ల కబర్ధి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ తన మనస్సులో మాట దేశ ప్రజలందరికీ తెలిపేందుకే మన్ కి బాత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈతకోట తాతాజీ, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నరిసే సోమేష్ పేర్కొన్నారు. పట్టణంలో రెండు చోట్ల ఆదివారం మన్ కీ బాత్ ప్రసారాన్ని ప్రజలు వీక్షించారు.

నీట్ లీకేజీ దోషులను శిక్షించాలి

పాలకొల్లు అర్బన్, జూన్ 30 : దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ అర్హత పరీక్షలను రద్దు చేయాలని, లీకేజీకి పాల్పడిన వ్యవహారంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించి దోషులు కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈపరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని లేఖలో ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగుని పట్ల మంత్రి నిమ్మల మానవత్వం

పాలకొల్లు టౌన్, జూన్ 30: పూలపల్లికి చెందిన 17ఏళ్ల దివ్యాంగుడు పామర్తి హేమంత్ సాయిపవన్‌ను తీసుకొచ్చి తల్లిదండ్రులు ఆదివారం మంత్రి రామానాయుడును కలిశారు. దీంతో అతని మానసిక పరిస్థితిని స్వయంగా చూసిన మంత్రి రామానాయుడు అతనిని ఎత్తుకున్నాడు. సమస్య ఏంటంటూ అడగ్గా ప్రస్తుతం దివ్యాంగుల పెన్షన్ రూ.3వేలు ఇస్తున్నారని మీ దయవల్ల ఒకటి నుంచి రూ.6వేలు పెరుగుతుందన్నారు. అయితే తమ కుమారుడికి పూర్తి వైకల్యం ఉండటం వలన పింఛన్ సొమ్ము పెరిగేలా చూడాలని కోరారు. దీంతో మంత్రి నిమ్మల స్పందించి వందశాతం వైకల్యం వర్తించేలా పింఛన్ సొమ్ము రూ.15వేల వరకు అందేలా చూస్తానంటూ భరోసా ఇచ్చారు. ఎత్తుకున్న వికలాంగుడు సాయిపవన్ శరీరం వేడిగా జ్వరం వచ్చినట్లుగా ఉందనీ, కఫం కూడా ఉన్నట్టుంది అని మంత్రి రామానాయుడు తల్లిదండ్రులకు చెప్పి బృందావన్ ఆసుపత్రి డాక్టర్ వర్మకు చూపించండి. వైద్యం అందేలా డాక్టర్ గారితో మాట్లాడతానని చెప్పగా అక్కడికి తీసుకెళ్లి వైద్యం చేయించి మంత్రి నిమ్మల మానవత్వాన్ని చాటుకున్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద రేషన్ పాయింట్

పాలకొల్లు టౌన్, జూన్ 30: టిడ్కోఇళ్ల సముదాయాల వద్ద రేషన్‌షాపు స్టాక్ పాయింట్‌ను ఆదివారం ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయాల్లో ఉంటున్న లబ్ధిదారులు రేషన్ వాహనం వచ్చే సమయంలో ఇళ్ల దగ్గర లేకపోవడంతో సరుకులు తీసుకోవడం లేదని, దీంతో ప్రతీ కార్డుదారుడు నెలనెలా రేషన్ సరుకులు తీసుకునేందుకు కాలనీలో కొత్త రేషన్‌షాపు స్టాక్ పాయింట్‌ను ప్రారంభించామన్నారు. మంత్రి నిమ్మలకు టిడ్కోఇళ్ల లబ్ధిదారులు స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు రోజారమణి దంపతులు, ఉన్నమట్ల కబర్ధి పాల్గొన్నారు.

మాలమహానాడు సత్కారం

పాలకొల్లు అర్బన్, జూన్ 30 : రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఆయన కార్యాలయంలో ఆదివారం మాలమహానాడు (పీవిరావు) రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు వర ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఇచ్చి సత్కరించారు ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెబుతున్న సీఎం చంద్రబాబు నాయుడు మాటలను వెనక్కి తీసుకోవాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

పేదలకు సేవ చేయడం నా భాగ్యం

పాలకొల్లు అర్బన్ జూన్ 30 : పేదలకు సేవ చేయడం నా భాగ్యంగా భావిస్తానని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక ఎంఎంకెఎస్‌ఎం హైస్కూల్లో ఆదివారం స్కూల్ పూర్వ విద్యార్థి, అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఎన్‌ఆర్‌ఐ వీరా సతీష్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వైద్య సేవలు అందించిన వైద్యులను మంత్రి నిమ్మల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు

పెనుమంట్ర, జూన్ 30 ఆచంట నియోజకవర్గంలో 29825 మందికి 19కోట్ల 65లక్షల రూపాయల పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మార్టేరుశ్రీ వేణు గో పాలస్వామి ఆడిటోరియంలో పింఛన్ల పంపిణీకి సంబంధించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టీడీపీ సర్పంచులకు కూడా ప్రాధాన్యం ఇవ్వకుండా అరాచక పాలన చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు గౌరవం ఇచ్చే విధంగా పరిపాలన కొనసాగుతుందని పితాని అన్నారు.

చంద్ర చంద్రశేఖర్ విరాళం

ఉండి, జూన్ 30: ఉండి నియోజకవర్గ డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు వ్యాపారవేత్త, స్వర్గసీమ చంద్ర చంద్రశేఖర్ రూ.1లక్ష అందించినట్లు ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఆదివారం పత్రికలకు వివరాలను అందించారు. ఈవిధంగా డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయనిధికి ముందుకు వచ్చి సహకారం అందించడం అభినందనీయమన్నారు. దాతలకు ఎమ్మెల్యే రఘురామ కృతజ్ఞతలు తెలిపారు.

మహోన్నత వ్యక్తి రామోజీరావు

ఉండి, జూన్ 30:అక్షరమే ఆయుధంగా ఝుళిపించిన మహోన్నత వ్యక్తి ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో పద్మవిభూషణ్ రామోజీరావు సంస్మరణ సభ జరిగింది. ఉండి ఎమ్మెల్యే హాజరై ఆయన సేవలను కొనియాడారు. చరిత్రపుటల్లో రామోజీరావు నిలిచిపోతారంటూ కితాబు ఇచ్చారు. రామోజీరావు కుమారుడు కిరణ్ కుటుంసభ్యులను ఆయన పరామర్శించారు.

తణుకు చరిత్రలోనే అతిపెద్ద విజయం

తణుకు, జూన్ 30: తణుకు నియోజకవర్గ చరిత్రలోనే అతిపెద్ద విజయాన్ని ప్రజలు అందించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అన్ని రంగాలను భ్రష్టు పట్టించిందన్నారు. పింఛన్‌లు ఒకేసారి పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో 36 వేల మందికి రూ.25 కోట్లు పింఛన్లు అందించనున్నామని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పింఛన్లు పంపిణీ చేయాలని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, టీడీపీ నాయకులు కలగర వెంకటకృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, పితాని మోహన్, గోపిశెట్టి రామకృష్ణ, చుక్కా సాయి తదితరులు మాట్లాడారు. వావిలాల సరళాదేవి, పరిమి వెంకన్నబాబు, ఆత్మకూరి రామకృష్ణ, చింతలపూడి సన్యాసిరావు పాల్గొన్నారు.

కూటమి నాయకులు పాల్గొనాలి

భీమవరం అర్బన్, జూన్ 30: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భీమవరం నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొనాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. టీడీపీ ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం తోట సీతారామలక్ష్మి కార్యాలయంలో జరిగింది. పట్టణంలో 11,384మంది లబ్ధిదారులకు గాను రూ.7,88,37,500 ప్రభుత్వం సిబ్బందితో పంపిణీ జరుగుతుందన్నారు. 26వ వార్డు నుంచి ఉదయం 6గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించనున్నారని వివరించారు.

గణపవరం: విడతల వారీగా కాకుండా ఒకేసారి మొత్తం పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి దక్కుతుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకర్లతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని కోరారు.

మొగల్తూరు: ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన టీడీపీ బూత్ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మామిడిశెట్టి సత్యనారాయణ, పాలా రాంబాబు, డొల్లా రత్నంరాజు, కత్తిమండ ముత్యాలరావు, పాలా గోపాలం, కవురు నాగేశ్వరావు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు

నరసాపురం రూరల్, జూన్ 30: శివారు ప్రాంత భూములకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. ఆదివారం రుస్తుంబాద వద్ద పంట కాల్వలో పేరుకుపోయిన తూడు, డెక్క తొలగింపు పనుల్ని ఆయన ప్రారంభించారు. పంట కాల్వలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని కాల్వల్లో తూడు, డెక్కలను తొలగించాలన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం ఎప్పుడు పని చేస్తుందన్నారు.



దివ్యాంగ బాలుడిని ఎత్తుకుని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు



ఎమ్మెల్యే రఘురామకు విరాళం అందిస్తున్న చంద్ర చంద్రశేఖర్



భీమవరంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి



నరసాపురంలో కాల్వలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

మంత్రి లోకేశ్‌ను కలిసిన రత్నం



ఆకివీడు, జూన్ 30: ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి అఖండ విజయంతో ఏపీలో ఇక వైసీపీలేనట్టేనని అన్నారు.

రేషన్‌లో అవకతవకలు అరికట్టాలి

ఆకివీడు, జూన్ 30: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని వినియోగదారుల రాష్ట్ర సంఘాల సమాఖ్య సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పాలిష్ పెట్టి విదేశాలకు ఎగుమతి చేస్తున్న భారీ కుంభకోణాన్ని మంత్రి సీజ్ చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా మండలాల్లో జరుగుతున్న అవకతవకలపై కూడా దృష్టి సారించాలన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్నారు.

నేషనల్ స్టాటిస్టిక్స్‌డే

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 30 : ప్రొఫెసర్ మహలనోబిస్ జయంతి సందర్భంగా జూన్ 29వ తేదీన జాతీయ గుణాంకాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శ్రీఆదిత్య కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఉన్నత భారత అభియాన్ ఆధ్వర్యంలో నేషనల్ స్టాస్టిటిక్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ సామ్యాజిక - ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పనలో గణాంకాల పాత్ర, యువతలో అవగాహన కల్పించడానికి ఈ రోజును జరుపుకుంటామన్నారు.

4న అల్లూరిపై బహిరంగ సభ

భీమవరం అర్బన, జూన్ 30: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు 127వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం భీమవరంలో ఈనెల 4వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.బలరాం తెలిపారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అల్లూరి శత వర్ధంతి నిర్వహణ కమిటీ సమావేశం ట్రస్టు కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఆరోజు జిల్లా వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఉదయం 10గంటలకు జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి స్మృతి వనం వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్యంతో వ్యాధులకు చెక్

నరసాపురం టౌన్, జూన్ 30: ఆక్యుపంక్చర్ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల్ని పూర్తిగా నివారించవచ్చునని కౌన్సిలర్ పాలూరి బాబ్జీ అన్నారు. ఆదివారం పట్టణంలోని చినమామిడిపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కొవ్వలి ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వచ్చిన రోగుల్ని వైద్యులు కొండా శ్రీధర్ వైద్య పరీక్షలు చేశారు.

మంత్రి నిమ్మలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

నరసాపురం టౌన్, జూన్ 30: మునిసిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలంటూ ఆదివారం మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి వినతిపత్రం అందించారు. పురపాలకంలో సుమారు 25ఏళ్ళ పాటు విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. ఎన్.థామస్, రాజు, రామకృష్ణ, నారాయణ, సూరి, దుర్గారావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవత కార్యవర్గం ఎన్నిక



భీమవరం టౌన్, జూన్ 30 : మానవతా సేవా సంస్థ భీమవరం మండల శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకారం వన్ టౌన్ లోని ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షుడు బుద్ధ రాజు వెంకటపతి రాజు అధ్యక్షత వహించారు. అధ్యక్షుడుగా పెన్మెత్స రామ్మోహన వర్మ, కార్యదర్శిగా వేమూరి రాంబాబు, కోశాధికారిగా గ్రంధి కుమార్ వెంకటేశ్వర వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా కేవీఎన్‌ఎస్ రాజు, సంయుక్త కార్యదర్శిగా పళ్ళ శేషలీల, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మీవీ నరసయ్య, చాన్‌బాషా, రవి, అల్లు శ్రీనివాస్ ప్రమాణం చేశారు.

పింఛన్‌దారులకు ఆర్థిక భరోసా

ఇరగవరం, జూన్ 30 : జూలై నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 164 మంది సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో కె. పద్మావతి తెలిపారు. మండలంలో 9,535 మంది పింఛనుదారులు ఉన్నారని, వీరు రూ. 6 కోట్ల 33 లక్షల 5 వేల రూపాయలు అందుకోనున్నారని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెంటపాడు, జూన్ 30: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో అర్జున్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని సందర్శించారు.

పింఛన్ల పంపిణీపై మైక్‌తో ప్రచారం



గణపవరం, జూన్ 30 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు జూలై ఒకటో తేదీన పంపిణీ నిమిత్తం పింఛన్‌దారులు ఇంటివద్దే సిద్ధంగా ఉండాలని కోరుతూ గ్రామాల్లో మైక్‌ల ద్వారా ప్రచారాన్ని అధికారులు చేపట్టారు. సరిపల్లెలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు గ్రామంలో ఆటోపై మైకు ప్రచారాన్ని ఆదివారం చేపట్టారు. సిబ్బంది వచ్చి పింఛన్లను పంపిణీ చేస్తారని కోరుతూ ముందస్తు ప్రచారం నిర్వహించాచరు.

రాష్ట్రంలో సినీ రంగానికి ఊతం



చంద్రబోస్‌తో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30: రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినీ రంగానికి ఊతమిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదని సినీ గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. పెదతాడేపల్లిలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జితో మాట్లాడారు. కరోనా సమయం నాటి నుంచి సినీ రంగం డీలా పడిందని అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో సినీ రంగానికి ప్రాధాన్యత ఉంటుందని కల్కి సినిమాతో నిర్మాతలకు అర్థం అయిందన్నారు. వారి వెంట సర్పంచ్ పోతుల అన్నవరం, తెలుగు యువత నాయకుడు గంధం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు బోదెల పరిశీలన



ఆకివీడు, జూన్ 30:కొల్లేరు పరిసర ప్రాంతాల్లో మురుగు బోదెల్లో పూడికలు తొలగించకపోతే వ్యవసాయ భూములు ముంపునకు గురవుతాయని రైతులు పెట్టుకొన్న అర్జీలు మేర ఆదివారం అటవీశాఖాధికారులు పరిశీలించారు. కొల్లేరు ఐదవ కాంటూరు పరిధిలోని బీదర్ చేడు, పాత వయ్యేరు, అవిశా కాలువ, పాత ఏరు కిక్కిస, గుర్రపుడెక్కతో పూడుకుపోయి పారుదల లేకపోవడంతో ప్రతీఏటా ముంపునకు గురవుతున్నాయని రైతులు ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకెళ్ళారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం కొల్లేరు ఐదవ కాంటూరులోని బీదర్ చేడు, పాత వయ్యేరు తవ్వుకొనే నిమిత్తం రైతులు అర్జీలు పెట్టుకోవడంతో డీఎఫ్‌వో హిమ శైలజ, రేంజర్ రంగాచార్యులు, సెక్షన్ అధికారి కరీమ్, డ్రెయినేజీ ఏఈ వెంకటేశ్వరరావు పరిశీలించారు. సమస్యను ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో సువర్ణరాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిరాజు తిమ్మరాజు, రైతులు గాదిరాజు సత్తిబాబు, జక్కరయ్య, వర ప్రసాద్ ఉన్నారు.

లక్ష్యానికి తూట్లు.. చెత్తతో పాట్లు



అత్తిలి, జూన్ 30 : అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో చెత్త వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సంపద కేంద్రాలకు తరలించాల్సి ఉన్నప్పటికీ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల సంపద కేంద్రాలు అలంకారంగా మిగులుతున్నాయి. గత ప్రభుత్వం సంపద కేంద్రాలను పట్టించుకోకపోవడం, రహదారుల పైనే చెత్త వేసినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే రహదారులపై చెత్త పేరుకుపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జూన్ 30: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఇంటింటా సంచార శకటం ద్వారా ఆదివారం వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలు, మందులు అందజేశారు. కోశాధికారి అర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత సేవలు భేష్

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 30: ప్రజలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పట్టణంలో మానవత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మానవత సభ్యులు బాబ్జిని సత్కరించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

బొలిశెట్టికి పిఠాపురం అర్చకుడి సత్కారం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30: జనసేన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు, శ్రీరామ హిందూ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విజయజనార్దనాచార్యులు ఆదివారం సత్కరించారు. స్వామివారి శేష వస్త్రాలు, పుష్పమాల, జ్ఞాపిక అందించారు.

వెరికోస్ వెయిన్స్ వైద్య శిబిరం



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆదివారం వెరికోస్ వెయిన్స్ వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వైద్య పరీక్షల్లో ఆపరేషన్ అవసరమైన వారికి తక్కువ ఖర్చుతోనే చేస్తామని వైద్యులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, పూర్వాధ్యక్షుడు వబిలిశెట్టి నటరాజ్, సంఘ నాయకులు ఆధ్వర్యం వహించారు.

రహదారులు జలమయం



వర్షపు నీటిలో డీఆర్ గోయెంకా మహిళా కళాశాల రహదారి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాడేపల్లిగూడెం రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి వర్షం పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలైన వానపల్లిగూడెం, కొబ్బరితోట, మామిడితోట, కడకట్ల, శ్రీదేవి పుంతరోడ్డు, ఎల్‌ఐసీ కాలనీ, డీఆర్ గోయెంకా మహిళా కళాశాల రోడ్డు తదితర ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆచంట: అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా జోరు వానలు పడుతూనే ఉన్నాయి. ఆదివారం కూడా ఏకధాటిగా వర్షం పడుతూనే ఉన్నది. వర్షాలు పడుతుండటంతో సాగు నిమిత్తం పనులు వేగంగా జరుగుతున్నాయి.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఇరగవరం, జూన్ 30 : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇరగవరంలో నీలాపు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల మంది కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు ధాన్యం సొమ్ము రాక మూడు నెలలుగా ఇబ్బందులు పడుతూ అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారన్నారు. వెంటనే ధాన్యం డబ్బులను విడుదల చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ మండలంలో సమస్యలను త్వరలో స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు ఇల్లందుపర్తి సత్యనారాయణ, జుత్తిగ రామాంజనేయులు, టి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

భీమవరం టౌన్, జూన్ 30 : గునుపూడిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం (హాస్టల్)లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బడికి పోదాం రా కార్యక్రమాన్ని నిర్వహించి హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ భానుమణి విద్యార్థులు పాల్గొన్నారు.